SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

RNI APTEL / 2018/76380

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 07 సంచిక : 335 | పేజీలు : 08, వెల రూ. 2 రూ/ | శనివారం 07-02-2026




## ఉమెన్స్ హాస్టల్‌లో అగ్ని ప్రమాదం.. అమ్మాయిలను కాపాడిన స్థానికులు

## తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు: ఢిల్లీలో వైసీపీ ఎంపీల మీడియా సమావేశం



లడ్డూ నెయ్యిలో కొవ్వు ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్న వైసీపీ ఎంపీలు

సీబీఐ, సిట్ నివేదికల్లో క్లీన్ చిట్ వచ్చిందని వెల్లడి


సత్యశోధన పరీక్షకు సిద్ధమన్న టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

రాజకీయ లబ్ధి కోసమే కూటమి విషప్రచారం చేస్తోందని ఆరోపణ

ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ కుట్రలన్న వైసీపీ

అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలు చేస్తున్న ఆరోపణలను వైసీపీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. లడ్డూ తయారీలో వాడే నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, సీబీఐ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని వారు తెలిపారు.

## కాంగ్రెస్ కోఆర్డినేటర్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!



★ మున్సిపల్ ఎన్నికల కోసం కోఆర్డినేటర్ల జాబితాను టీపీసీసీ విడుదల

★ అనూహ్యంగా ఈ జాబితాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పేర్లు కనిపించడం

# మీరు చేసింది మహా పాపం...

## ఏక సభ్య కమిషన్ వేస్తున్నాం: సీఎం చంద్రబాబు

★ తిరుమల నెయ్యి కల్తీపై సీఎం చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజం

★ గత వైసీపీ ప్రభుత్వం 2022 నివేదికను ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టిందని ఆరోపణ

★ సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన మొదలుపెట్టానని వెల్లడి

★ పామాయిల్, కెమికల్స్, జంతువుల కొవ్వుతో నెయ్యి తయారు చేశారని ఆగ్రహం

★ దేవుడితో పెట్టుకోవద్దని, భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దని తీవ్ర హెచ్చరిక



అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో నెయ్యి కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ వ్యవహారాన్ని తొక్కిపెట్టి, భక్తుల మనోభావాలను దెబ్బతీసిందని, ఇది క్షమించరాని మహా పాపం అని ఆయన అభివర్ణించారు. దేవుడితో చెలగాటమాడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలపై జరిగిన దాడులను, అపవిత్ర ఘటనలను గుర్తుచేస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల కీలక సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు.

భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దు

కరడుగట్టిన నేరస్థులు అసత్యాన్ని ఎలా నమ్మిస్తారో, అలాగే గత పాలకులు ఇప్పుడు మాట్లాడుతున్నారని చంద్రబాబు అన్నారు. "సీబీఐ నివేదికలో కల్తీ లేదని ఎక్కడా చెప్పలేదు. అయినా, కల్తీ జరగలేదని ఎదురుదాడి చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు. రాష్ట్రంలోని భక్తులందరికీ ఒక సామాన్య భక్తుడిగా విజ్ఞప్తి చేస్తున్నా. దేవునికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాలి. ఈ దోషులను కఠినంగా శిక్షిస్తాం. ఏకసభ్య కమిషన్ వేసి సమగ్ర విచారణ జరిపిస్తాం. ఇప్పటివరకు ఉన్న నివేదికలన్నీ ఆ కమిషన్ ముందు ఉంచుతాం. అవసరమైతే కోర్టులోనూ అదనపు సమాచారం సమర్పిస్తాం. ఇది దేవుడిచ్చిన బాధ్యత, దైవ కార్యం.

## తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు: పవన్ కల్యాణ్



- గత వైసీపీ ప్రభుత్వంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర ఆరోపణలు
- తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు పామాయిల్, రసాయనాలు వాడారని వ్యాఖ్య
- అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి కూడా లక్ష కల్తీ లడ్డూలు పంపారని ఆరోపణ
- గత ప్రభుత్వం దేవుడిపైనే పగబట్టిందని, ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనని విమర్శ
- ఈ వ్యవహారంలో ఎక్కడా సీబీఐ క్లీన్ చిట్ ఇవ్వలేదని, వాస్తవాలు బయటపెడతామని స్పష్టీకరణ

అమరావతి: ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గత వైసీపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తులు ఎంతో పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని

## రెండేళ్లుగా శ్రీవారి లడ్డూల్లో కల్తీ నెయ్యి.. తెలిసినా వైసీపీ ప్రభుత్వం మౌనంగా ఉంది




తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి

ఈ వ్యవహారం తెలిసినా గత వైసీపీ ప్రభుత్వం నివేదికను తొక్కిపెట్టిందని ఆరోపణ

నెయ్యిలో చేపల నూనె, జంతు కొవ్వు కలిసినట్లు ఎన్‌డీడీబీ రిపోర్ట్ ఇచ్చిందని వెల్లడి

## రష్యా ఆయిల్ బంద్.. ట్రంప్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ హాట్ కామెంట్స్!



ఏ దేశం నుంచి చమురు కొనాలనేది భారత్ ఇష్టమన్న రష్యా

రష్యా సరఫరాను అమెరికా భర్తీ చేయడం అసాధ్యమని స్పష్టీకరణ


ఇంధన భద్రత కోసం భారత్ వైవిధ్యమైన మార్గాల అన్వేషణ

## భారత్‌కు అమెరికా బంపరాఫర్



ఢిల్లీ: భారత్–అమెరికా ట్రేడ్ డీల్‌లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా అమెరికాతో జరిగిన ట్రేడ్ డీల్‌లో రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను నిలిపివేసేలా ఒప్పందం కుదుర్చుకుంది. ప్రతిఫలంగా అమెరికా.. భారత్‌కు విధించే ప్రతీకార పన్నును 18 శాతం తగ్గించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేయనున్నారు.

## 7,8లలో ప్రధాని మోదీ మలేషియా పర్యటన



న్యూఢిల్లీ: మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ఆహ్వానం మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 7, 8 తేదీల్లో ఆ దేశంలో అధికారికంగా పర్యటించనున్నారు. ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై కీలక చర్చలు జరగనున్నాయి. మోదీ మలేషియాలో పర్యటించడం ఇది మూడోసారి.

## కేసీఆర్ మళ్లీ సీఎం అయితే సూపర్.. ఇదే జనం మాట: కేటీఆర్

- మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు
- రైతు బంధ్‌కి ఎన్నికలకు ఏం సంబంధం..?
- హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోని ప్రభుత్వానికి బుద్ధి చెప్పే అవకాశం ఇదే'



రాజన్న: మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని రెండేళ్లలో అభివృద్ధి ఏం చేశారని ప్రశ్నిస్తే మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని అంటున్నారు.

# రాజకీయాల్లో డబ్బుతో కాదు.. నమ్మకంతో గెలుస్తాం: సీఎం రేవంత్

- 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది'
- ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచన
- ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు
- ప్రభుత్వం చేసింది ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచనలు



టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలి

కరీంనగర్,: రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని..

## రేవంత్ రెడ్డికి ఇచ్చిన సర్టిఫికెట్ వెనక్కి తీసుకోవాలని హార్వర్డ్ వర్సిటీకి లేఖ పంపాను: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ ఇచ్చిన సర్టిఫికెట్‌పై తీవ్ర అభ్యంతరం
- సర్టిఫికెట్‌ను తక్షణమే రద్దు చేయాలని హార్వర్డ్ యూనివర్సిటీకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లేఖ
- రేవంత్‌పై 89 క్రిమినల్ కేసులున్నాయని, ఓటుకు నోటు కేసులో జైలుకు వెళ్లారని ఆరోపణ

## రష్యా ఆయిల్ బంద్..
## ట్రంప్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ హాట్ కామెంట్స్!

ఢిల్లీ: భారత్, రష్యా నుంచి చమురు కొనుగోళ్లు నిలిపివేసి, అమెరికా నుంచి కొనుగోలు చేసేందుకు ప్రధాని మోదీ అంగీకరించారన్న డొనాల్డ్ ట్రంప్ ప్రకటన అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నేపథ్యంలో రష్యా (క్రెమ్లిన్) బుధవారం అత్యంత వ్యూహాత్మకంగా స్పందించింది. భారత్ తన చమురు అవసరాల కోసం ఇతర దేశాల వైపు చూడటం కొత్తేమీ కాదని, అది తమకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని రష్యా అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ పేర్కొన్నారు. అయితే, చమురు కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు న్యూఢిల్లీ నుంచి తమకు ఎటువంటి అధికారిక సమాచారం అందలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే, రష్యా ఇచ్చే భారీ స్థాయి చమురును అమెరికా భర్తీ చేయడం ఆచరణాత్మకంగా అసాధ్యమని ఇంధన రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారత్ ప్రస్తుతం రష్యా నుంచి రోజుకు 15 నుంచి 20 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకుంటోంది. అమెరికా సరఫరా చేసే తేలికపాటి చమురు భారతీయ రిఫైనరీలకు సరిపోదని, రష్యా ఇచ్చే యురల్స్ గ్రేడ్ చమురుకు అది ప్రత్యామ్నాయం కాలేదని నిపుణులు గుర్తు చేస్తున్నారు. నిజానికి 2021 వరకు భారత చమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 0.2 శాతం మాత్రమే ఉండేది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యా రాయితీపై చమురు ఇవ్వడంతో భారత్ అతిపెద్ద కొనుగోలుదారుగా అవతరించింది. ఇప్పుడు ట్రంప్ ఒత్తిడి లేదా వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా భారత్ తన దిగుమతులను వైవిధ్యపరుస్తోంది. ఒకవేళ రష్యా సరఫరాను నిలిపివేస్తే, గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 120 డాలర్ల వరకు పెరిగి, అమెరికాలోనే పెట్రోల్ ధరలు రికార్డు స్థాయికి చేరే ప్రమాదం ఉందని రష్యా హెచ్చరిస్తోంది.

## భారత్‌కు అమెరికా బంపరాఫర్

మొదటి పేజి తరువాయి

ఈ ఒప్పందంపై ఇరు దేశాల ప్రతినిధులు సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేయనున్నారు. అదే సమయంలో అమెరికా నుంచి భారత్ సైతం 500 బిలియన్ డాలర్ల విలువైన ఇంధనం, సాంకేతిక ఉత్పత్తులను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ ప్రకటనపై వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సైతం స్పష్టత ఇచ్చారు. సీనియర్ అమెరికా అధికారులు వచ్చే వారం ఢిల్లీలో ఒప్పందంపై సంతకం చేయడానికి రానున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఫిబ్రవరి 3న భారత్--అమెరికా వాణిజ్య ఒప్పందం తుది రూపం దాల్చింది. ఈ ఒప్పందం ద్వారా అమెరికా భారతీయ వస్తువులపై విధిస్తున్న సుంకాలను 50శాతం నుంచి 18శాతానికి తగ్గించింది. ఇది రెండు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలను తగ్గించి, భారత ఎగుమతులకు కొత్త అవకాశాలు కలిగేందుకు దోహదం చేయనున్నట్లు మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## 7,8లలో ప్రధాని మోదీ మలేషియా పర్యటన

మొదటి పేజి తరువాయి

మోదీ మలేషియాలో పర్యటించడం ఇది మూడోసారి. 2024, ఆగస్టులో ఇరు దేశాల మధ్య కుదిరిన 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం' తర్వాత ప్రధాని మోదీ చేస్తున్న పర్యటన ఇదే కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ, అన్వర్ ఇబ్రహీంలు భారత్–మలేషియా సంబంధాలలోని పలు అంశాలపై సమగ్రంగా చర్చించనున్నారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సముద్ర తీర సహకారం తదితర రంగాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. వీటితో పాటు డిజిటల్, ఫైనాన్షియల్ టెక్నాలజీ, ఇంధనం, ఆరోగ్యం, విద్య, సంస్కృతి, పర్యాటక రంగాల్లో పరస్పర సహకారాన్ని ఇరు దేశాల నేతలు సమీక్షించనున్నారు. భవిష్యత్తులో రెండు దేశాల ప్రయోజనాల కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా ఈ భేటీలో చర్చించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ మలేషియాలోని భారతీయ కమ్యూనిటీ సభ్యులతో సమావేశం కానున్నారు. పారిశ్రామిక, వ్యాపార రంగ ప్రముఖులతో ఆయన ముఖాముఖి నిర్వహించనున్నారు. ఇదే సమయంలో '10వ భారత్–మలేషియా సీఈఓ ఫోరమ్' కూడా జరగనుంది. ప్రజల మధ్య సంబంధాలను పెంపొందించడం ద్వారా ఇరు దేశాల మైత్రిని మరింత పటిష్టం చేయడమే ఈ భేటీల ప్రధాన ఉద్దేశం. భారత్– మలేషియాల మధ్య సుదీర్ఘమైన చారిత్రక, నాగరికత, సాంస్కృతిక సంబంధాలు ఉన్నాయి.

## కేసీఆర్ మళ్లీ సీఎం అయితే సూపర్.. ఇదే జనం మాట: కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్‌రెడ్డిని రెండేళ్లలో అభివృద్ధి ఏం చేశారని ప్రశ్నిస్తే మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని అంటున్నారు. ఉచిత ప్రయాణం అంటే స్త్రీలకు ఫ్రీ ఇచ్చి, పురుషులకు రెట్టింపు చార్జీ వసూలు చేయడమేనా? అని ప్రశ్నించారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. అభ్యర్థులను గెలిపించుకునేందుకు ఆయా పార్టీల ముఖ్యనేతలు రంగంలోకి దిగారు. అభ్యర్థుల్ని గెలిపించుకునే బాధ్యతల్ని బుజాన వేసుకున్నారు. ప్రచారంతో హోరెత్తిస్తున్నారు. గురువారం కేటీఆర్ సిరిసిల్ల మున్సిపల్ ఒకటవ వార్డు జ్యోతి నగర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో పెన్షన్లు నాలుగు వేలకు పెంచుతామని చెప్పారు. పెంచలేదు. ఎన్నికల తరువాత రైతుబంధు అంటున్నారు. రైతు బంద్‌కి ఎన్నికలకు ఏం సంబంధం..? ఫ్రీ స్కూటి ఇస్తానని, ఇవ్వకుండా లూటీ చేస్తున్నారు. నాపై కోపంతో సిరిసిల్ల జిల్లా తీసేస్తారట. మళ్ళీ కేసిఆర్ ముఖ్యమంత్రి అయితే బాగుంటుందని అంటున్నారు. జ్యోతినగర్ అభివృద్ధి విషయంలో ఏమైనా తప్పు జరిగితే క్షమించండి. కేసీఆర్ కిట్ తీసివేశారు, కేసీఆర్ పేరు ఉందని తీసేస్తారా..? అవసరమైతే ఇందిరమ్మ కిట్ అని పేరుపెట్టి, కొనసాగించాలి. కొత్త సంక్షేమ పథకాలు ఇవ్వడం కాదు, ఉన్న పథకాలు తీసేశారు.ఇక్కడి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించండి, జ్యోతినగర్ ను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తాను.హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోని ప్రభుత్వానికి బుద్ధి చెప్పే అవకాశం ఇదే'అని వ్యాఖ్యానించారు.

## రేవంత్ రెడ్డికి ఇచ్చిన సర్టిఫికెట్ వెనక్కి తీసుకోవాలని హార్వర్డ్ వర్సిటీకి లేఖ పంపాను: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ ఇటీవల జారీ చేసిన సర్టిఫికెట్‌పై తీవ్ర వివాదం రేగింది. ఈ సర్టిఫికెట్‌ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అదే యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, బీఆర్ఎస్ నేత డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గురువారం హార్వర్డ్ అధ్యక్షుడికి, డీన్‌కు ఘాటైన ఈ–మెయిల్ పంపారు. దేశంలోనే అత్యధికంగా 89 క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న, ఓటుకు నోటు కేసులో ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దొరికి జైలు జీవితం గడిపిన వ్యక్తికి హార్వర్డ్ సర్టిఫికెట్ ఇవ్వడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రవీణ్ కుమార్ తన లేఖలో సీఎం రేవంత్ రెడ్డి ట్రాక్ రికార్డును ప్రస్తావిస్తూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. "దేశంలో ఏ ముఖ్యమంత్రి ఎదుర్కోనన్ని క్రిమినల్ కేసులు (89) ఎదుర్కొంటూ, ఓటుకు నోటు కేసులో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి దొరికి, దాదాపుగా 50 రోజులు జైలులో గడిపి, ఇప్పుడు సీఎంగా పలు కుంభకోణాలకు పాల్పడుతూ, తెలంగాణ ప్రజల మీద ప్రతీకారం తీర్చుకుంటున్నారు. ప్రతిచోటా ప్రత్యర్థులపై అభ్యంతరకరమైన భాషను ప్రయోగిస్తున్న ఇలాంటి రాజకీయ నాయకుడు 21వ శతాబ్దానికి పనికిరాడు. ప్రాచీన రాతి యుగంలో కూడా ఇలాంటి నాయకులు ఉండి ఉండరు. ఇంతటి ట్రాక్ రికార్డు ఉన్న నాయకుడికి హార్వర్డ్ యూనివర్సిటీ సర్టిఫికెట్ ఇవ్వడం దేనికి సంకేతం?" అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తాను హార్వర్డ్‌కు పంపిన ఈ–మెయిల్ సారాంశాన్ని ఆయన మీడియాకు విడుదల చేశారు.

## ఉమెన్స్ హాస్టల్‌లో అగ్ని ప్రమాదం.. అమ్మాయిలను కాపాడిన స్థానికులు

ముషీరాబాద్: హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌లో ఉమెన్స్ హాస్టల్‌లో అ?గ్ని ప్రమాద ఘటన చోటుచేసుకుంది. వాష్‌రూమ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో గీజర్ పేలి మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమై.. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. మరోవైపు.. మంటలు వ్యాపించిన సమయంలో హాస్టల్‌లో ఉన్న ఇద్దరు అమ్మాయిలను స్థానికులు నిచ్చెన సాయంతో కిందకు తీసుకువచ్చినట్టు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల గాంధీనగర్‌లో 'సుధామ పీజీ అకామిడేషన్ ఫర్ విమెన్' హాస్టల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కాగా, వాష్‌రూమ్‌లో షార్ట్ సర్క్యూట్‌తో గీజర్ పేలి మంటలు చెలరేగినట్టు తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో హాస్టల్‌లో విద్యార్థినులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కానీ, హాస్టల్‌లో మంటలు వేగంగా వ్యాపించి భవనం నుండి భారీగా పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ముషీరాబాద్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మూడు ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. మంటలు భారీగా ఎగిసిపడటంతో హాస్టల్‌లోని ఫర్నిచర్, దుస్తులు, ఇతర వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఇక, హాస్టల్ యజమాన్యం నుండి వివరాలు సేకరిస్తున్న పోలీసులు.. భవనంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## రాజకీయాల్లో డబ్బుతో కాదు.. నమ్మకంతో గెలుస్తాం: సీఎం రేవంత్

మొదటి పేజి తరువాయి

అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్ధాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

## మీరు చేసింది మహా పాపం... ఏక సభ్య కమిషన్ వేస్తున్నాం: సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

ఇది దేవుడిచ్చిన బాధ్యత, దైవ కార్యం. ఇలాంటివి పునరావృతం కాకుండా చూస్తాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

దేవుడితో పెట్టుకోవద్దు.. ఇది దుర్మార్గమైన అపచారం

వైసీపీ నేతలకు దేవుడిపై విశ్వాసం లేకపోవచ్చని, కానీ విశ్వాసం ఉన్న కోట్ల మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసే హక్కు వారికి లేదని చంద్రబాబు హెచ్చరించారు. "అంతర్వేదిలో రథం తగలబడితే కందిరీగలు కొరికాయని, ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు. విశ్వాసం లేకపోతే దేవుడి జోలికి రావొద్దు. దేవుడి పవిత్రతను దెబ్బతీయడం దుర్మార్గం. చరిత్రలో ఇప్పటివరకు శ్రీ వెంకటేశ్వర స్వామి జోలికి ఎవరూ రాలేదు. బ్రిటిష్ వాళ్లు కూడా స్వామివారి సంప్రదాయాలను గౌరవించి, మరింత అభివృద్ధి చేశారు. అలాంటిది మీరు చేసిన ఈ పని దుర్మార్గమైన అపచారం" అని ఆయన తీవ్రంగా ఖండించారు.

సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ప్రక్షాళన

తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి ప్రాధాన్యతగా పరిపాలన, దైవ కార్యాల ప్రక్షాళనపై దృష్టి సారించానని చంద్రబాబు వివరించారు. "ముఖ్యమంత్రిగా నా కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఒక ప్రిన్సిపల్ సెక్రటరీని నియమించడం నా మొదటి సంతకం. మానవ సేవ కన్నా ముందు మాధవ సేవ




ముఖ్యమని భావించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తిరుమల ప్రక్షాళన కోసం టీటీడీ ఈఓగా శామలరావును నియమిస్తూ రెండో సంతకం చేశాను. ఈ రెండు పనులు పూర్తి చేశాకే ఇతర కార్యక్రమాలు చేపట్టాను" అని ఆయన తెలిపారు. అనంతరం తిరుమలలో పరిస్థితులను సమీక్షించి, కల్తీ జరుగుతోందన్న అనుమానంతో నెయ్యి శాంపిల్లను నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ)కు పంపించామని, ఆ నివేదికలోనే కల్తీ వాస్తవాలు బయటపడ్డాయని స్పష్టం చేశారు.

2022లోనే నివేదిక.. అయినా తొక్కిపెట్టారు

ఈ కల్తీ వ్యవహారం కొత్తగా బయటపడింది కాదని, 2022లోనే గత వైసీపీ ప్రభుత్వానికి దీనిపై నివేదిక అందిందని చంద్రబాబు సంచలన విషయాలు వెల్లడించారు."2022లో సీఎఫ్టీఆర్ఐ ఇచ్చిన నివేదికలో నెయ్యి కల్తీ జరుగుతోందని చాలా స్పష్టంగా ఉంది. కానీ, ఆ నివేదికను వాళ్లు ఉద్దేశపూర్వకంగా తొక్కిపెట్టారు. యథేచ్ఛగా కల్తీ నెయ్యి సరఫరాను కొనసాగించారు" అని ఆయన ఆరోపించారు. ఇప్పుడు ఏర్పాటైన సిట్ విచారణలో మరింత భయంకరమైన నిజాలు బయటపడ్డాయని, నెయ్యి తయారీలో పామాయిల్, ప్రమాదకర రసాయనాలు, చివరికి జంతువుల కొవ్వు (యానిమల్ ఫ్యాట్) కూడా వాడుతున్నట్లు తేలిందని ముఖ్యమంత్రి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

గత ఐదేళ్లలో హిందూమతంపై దాడి

గత ఐదేళ్ల వైసీపీ పాలనలో హిందూ దేవాలయాలు, సంప్రదాయాలపై దాడులు పరాకాష్టకు చేరాయని చంద్రబాబు విమర్శించారు. "ఒకప్పుడు ఇదే అసెంబ్లీలో తిరుమల రెండు కొండలే, ఏడు కొండలు కాదని మాట్లాడినప్పుడు మేం వ్యతిరేకించాం. విజయనగరంలో రాముడి విగ్రహం తల నరికివేస్తే, అక్కడికి వెళ్లి వాస్తవాలు తెలుసుకోవాలనుకున్న నాపైనే కేసు పెట్టారు. అంతర్వేదిలో రథం తగలబడితే ఎలుకలు కొరికాయని చెప్పారు. ఆంజనేయుడి విగ్రహాన్ని పగలగొడితే 'అదో బొమ్మే కదా, ఇంకోటి పెట్టుకోండి' అని అప్పటి పాలకులు ఎంతో గర్వంగా మాట్లాడారు. ఇవన్నీ చేస్తూ, తిరిగి మాపైనే నిందలు వేశారు" అని ఆయన మండిపడ్డారు.

## తిరుమల లడ్డూ వ్యవహారంలో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదు: పవన్ కల్యాణ్

మొదటి పేజి తరువాయి

గత ప్రభుత్వ హయాంలో భారీ కుంభకోణం జరిగిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టు వరకు వెళ్లినా, ఇందులో సీబీఐ ఎక్కడా క్లీన్ చిట్ ఇవ్వలేదని ఆయన గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో దోషులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, భగవంతుడి ముందు వారు మోకరిల్లే వరకు తమ యుద్ధం ఆగదని హెచ్చరించారు. నెయ్యి పేరుతో పామాయిల్, ప్రమాదకరమైన రసాయనాలు వాడి భక్తుల మనోభావాలను, ఆరోగ్యాన్ని దెబ్బతీశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ వ్యవహారంపై మాట్లాడేటప్పుడు తాము అన్ని పరిణామాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఈ అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. ఇవాళ ఉండవల్లిలో కూటమి నేతల సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్ లో పవన్ మాట్లాడారు. పవన్ కల్యాణ్ తన ఆరోపణలకు సంబంధించిన గణాంకాలను కూడా మీడియా ముందుంచారు. "తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఓ నిర్దిష్ట కంపెనీ 59.70 లక్షల కిలోల నెయ్యి సరఫరా చేసినట్లు అధికారికంగా లెక్కలు చూపింది. కానీ, మా వద్ద ఉన్న ఆధారాల ప్రకారం, అదే కంపెనీ 58 లక్షల కిలోలకు పైగా పామాయిల్, దానికి సంబంధించిన ప్లాంట్ బేస్డ్ ఉత్పత్తులను కొనుగోలు చేసింది. అంతేకాకుండా, సుమారు 1.70 లక్షల నుంచి 2 లక్షల కిలోల వరకు రసాయనాలను కూడా కొనుగోలు చేసినట్లు ఆన్ రికార్డ్ ఆధారాలున్నాయి. నెయ్యి సరఫరా చేస్తున్నామని చెప్పి, పామాయిల్, రసాయనాలు కొనుగోలు చేయడం వెనుక ఉన్న మతలబు ఏంటి? ఇది కల్తీ నెయ్యి కాదు, కల్తీ వనస్పతి, కల్తీ పామాయిల్" అని పవన్ వివరించారు. ఈ కుంభకోణం కేవలం తిరుమలతోనే ఆగిపోలేదని, అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి కూడా ఇక్కడి నుంచి పంపిన లక్ష లడ్డూలు సైతం ఈ కల్తీ నెయ్యితో తయారు చేసినవేనని పవన్ ఆరోపించారు. దేశమంతా ఎంతో పవిత్రంగా జరుపుకున్న కార్యక్రమానికి సైతం కల్తీ లడ్డూలు పంపి హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వానికి దేవుడిపై, హిందూ సంప్రదాయాలపై పగ ఉందని, అందుకే ఇలాంటి




చర్యలకు పాల్పడ్డారని పవన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. "వీరికి ఏడుకొండల స్వామిపై ఎందుకో పగ. ఏడు కొండలు ఎందుకు, రెండు చాలు అన్న చరిత్ర వీరిది. వీరు వ్యక్తులపై, ప్రత్యర్థులపై కాదు, ఏకంగా భగవంతుడిపైనే పగబట్టారు. ఈ కుట్ర వెనుక ఉన్న వారి వారసత్వం, వారి పరంపర ఎలాంటిదో ప్రజలు గమనించాలి. అందుకే ఈ అంశాన్ని సరిదిద్ది, వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది" అని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ అక్రమాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. "గత ఐదేళ్లలో, అంటే 2019 నుంచి 2024 వరకు, రాష్ట్రంలో వైసీపీ పాలనలో హిందూ ధర్మానికి, దేవాలయాలకు తీరని అపచారాలు జరిగాయి. ఇవి చాలా సున్నితమైన అంశాలు. మత విశ్వాసాలతో ముడిపడి ఉన్న విషయాలపై ఆనాటి ప్రభుత్వ పెద్దలు చూపిన నిర్లక్ష్యం, వారి బాధ్యతారాహిత్యం ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఉదాహరణకు, రామతీర్థంలో సాక్షాత్తూ శ్రీరామచంద్రమూర్తి విగ్రహ శిరచ్ఛేదనం జరిగితే, దాన్ని ఎవరో ఆకతాయి చేసిన పనిగా తేల్చేశారు. పిఠాపురంలో దేవతా విగ్రహాలకు అశుద్ధం పూస్తే, దానిని ఎవరో పిచ్చోడి చర్యగా చిత్రీకరించి చేతులు దులుపుకున్నారు. విజయవాడ కనకదుర్గమ్మ వారి ఆలయంలో వెండి సింహాలు మాయమైతే, 'అవి పోతే ఇంకొకటి కొంటాం, వాటితో ఏమైనా మేడలు, మిద్దెలు కడతామా?' అని అప్పటి మంత్రులు ఎంత నిర్లక్ష్యంగా మాట్లాడారో ప్రజలు మర్చిపోలేదు. ఇక అంతర్వేదిలో పవిత్రమైన రథం కాలిపోతే, దాన్ని మతిస్థిమితం లేని వ్యక్తి చేసిన పనిగా తేల్చేసి కేసును పక్కన పెట్టేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సంఘటనలు ఎన్నో జరిగినా, ఆనాటి ప్రభుత్వంలో ఒక్కరు కూడా బాధ్యతగా మాట్లాడటం గానీ, కఠిన చర్యలు తీసుకోవడం గానీ చేయలేదు. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఇలాంటి పాత విషయాలపై ఆరోపణలు, విమర్శలు చేసి రాజకీయ లబ్ధి పొందాల్సిన అవసరం మాకేముంటుంది? మా దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి కాబట్టే ఈ విషయాలను ప్రస్తావిస్తున్నాం. జరిగిన వాస్తవాలు మాకు తెలిసి కూడా ప్రజలకు చెప్పకపోతే, భవిష్యత్తులో వారే మమ్మల్ని నిలదీస్తారు, 'మీకు తెలిసినా ఎందుకు మౌనంగా ఉన్నారు?' అని అడుగుతారు. అందుకే బయటకు వచ్చి మాట్లాడుతున్నాం. గత ఐదేళ్లలో హైందవ సంస్కృతి, మన ధర్మంపై వైసీపీ ప్రభుత్వం తరచుగా దాడులకు, అపవిత్ర కార్యాలకు తెగబడింది. అందుకే దీనిపై మాట్లాడాల్సిన, ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం జరిగిన తప్పులకు క్షమాపణ చెప్పాల్సింది పోయి, ఎదురు మాపైనే విమర్శలు చేస్తున్నారు. ఒకటే విషయాన్ని స్పష్టంగా చెప్తున్నాను... భగవంతుడి మీద పగ పెట్టుకున్నవాడు ఎవడైనా సరే సర్వనాశనం అయిపోతాడు. చరిత్రలో అలా బతికి బట్ట కట్టిన దాఖలాలు కూడా లేవు. ఈ విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి" అని పవన్ తీవ్ర హెచ్చరికలు చేశారు.

## తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు: ఢిల్లీలో వైసీపీ ఎంపీల మీడియా సమావేశం

మొదటి పేజి తరువాయి

సీబీఐ నివేదిక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేసిందని వారు తెలిపారు. ఉండవల్లిలో కూటమి నేతలు చేసిన విమర్శలకు కౌంటర్‌గా గురువారం ఢిల్లీలో వైసీపీ ఎంపీలు వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి మీడియా సమావేశం నిర్వహించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారంటూ వచ్చిన ఆరోపణలపై సుప్రీంకోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరిపి, అందులో నిజం లేదని తేల్చిందని వైసీపీ నేతలు గుర్తుచేశారు. ఆ తర్వాత సీబీఐ కూడా అదే నిర్ధారణకు వచ్చిందని పేర్కొన్నారు. అయినా, కూటమి ప్రభుత్వం కావాలనే విషప్రచారం చేస్తూ, ఫ్లెక్సీలు పెట్టి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని వారు ఆరోపించారు.

ఏ ప్రమాణానికైనా సిద్ధం: వైవీ సుబ్బారెడ్డి

టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తనపై చేస్తున్న ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదని, ఎలాంటి పరీక్షకైనా తాను సిద్ధమని సవాల్ విసిరారు. "నేను టీటీడీ ఛైర్మన్‌గా ఎలాంటి అవినీతికి పాల్పడలేదు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే పనులు చేయలేదు. స్వామివారి సాక్షిగా ఏ ప్రమాణం చేయడానికైనా నేను రెడీ. అవసరమైతే దేవుడి ముందు సత్యశోధన (పాలిగ్రాఫ్)



పరీక్షకు కూడా సిద్ధంగా ఉన్నాను" అని ఆయన స్పష్టం చేశారు. నెయ్యి సరఫరాను పెంచేందుకే నిబంధనలు సవరించామని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడలేదని వివరించారు. వివాదాస్పదమైన 'బోలె బాబా' కంపెనీ సరఫరా నిబంధనల సవరణకు ముందే జరిగిందని, అది కూడా టీడీపీ హయాంలోనే మొదలైందని గుర్తుచేశారు. తనపై ఆరోపణలు ఎదుర్కొంటున్న చిన్న అప్పన్న తన పీఏ కాదని, కేవలం ఏపీ భవన్‌లో లైజన్ ఆఫీసర్ మాత్రమేనని ఆయన తేల్చిచెప్పారు.

దేవుడిని రాజకీయాలకు వాడుకుంటున్నారు: మిథున్ రెడ్డి

వైసీపీ లోక్‌సభా పక్ష నేత మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయ లబ్ధి కోసం పవిత్రమైన వెంకటేశ్వర స్వామిని కూడా వాడుకుంటున్నారని, ఇది ఘోరమైన తప్పని విమర్శించారు. "సిట్ నివేదిక చంద్రబాబు ఆరోపణలు అబద్ధమని తేల్చింది. దాన్ని జీర్ణించుకోలేక ఇప్పుడు మళ్లీ కొత్త కమిటీలు వేసి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారు. వైవీ సుబ్బారెడ్డి గారు వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడు. అలాంటి వ్యక్తిపై ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయడం దుర్మార్గం" అని మిథున్ రెడ్డి అన్నారు.

వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఈ కుట్ర: గురుమూర్తి

తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ.. సీబీఐ, సిట్ నివేదికలు టీడీపీ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటివని, అందుకే ఆ నివేదికలను పక్కనపెట్టి మళ్లీ కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. "ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారు. గత జనవరి నుంచి టీటీడీ ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా పనిచేస్తున్నారు" అని ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో ఆరోపణలు రాగానే 'బోలె బాబా' కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టామని, కానీ ఇప్పుడు కావాలనే పాత విషయాలను తవ్వి తీస్తున్నారని విమర్శించారు. దేవుడితో రాజకీయాలు చేసేవారికి తగిన శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు. దర్యాప్తు సంస్థల నివేదికలను గౌరవించి, అసత్య ప్రచారాలను వెంటనే ఆపాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు.

## రెండేళ్లుగా శ్రీవారి లడ్డూల్లో కల్తీ నెయ్యి.. తెలిసినా వైసీపీ ప్రభుత్వం మౌనంగా ఉంది




అమరావతి: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, ఈ విషయం తెలిసినా గత వైసీపీ ప్రభుత్వం వాస్తవాలను తొక్కిపెట్టిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సంచలన ఆరోపణలు చేశారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ అంశంలో గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆయన విమర్శించారు. ఉండవల్లిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో సమావేశం ముగిసిన అనంతరం కూటమి నేతలు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా పయ్యావుల మాట్లాడుతూ, ప్రజలకు నిజాలు తెలియాలనే ఉద్దేశంతోనే ఈ విషయాలను బయటపెడుతున్నట్లు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యత తగ్గిందని, నెయ్యి మంచి వాసన రావడం లేదని భక్తుల నుంచి విస్తృతంగా ఫిర్యాదులు వచ్చాయని పయ్యావుల గుర్తుచేశారు. పోటు కార్మికులు సైతం నెయ్యి నూనెలా జారిపోతోందని చెప్పినా, అప్పటి పాలకులు దాన్ని ఆర్గానిక్ నెయ్యి అంటూ తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమల ఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామలరావు.. అనుమానంతో నాలుగు ట్యాంకర్ల నెయ్యి శాంపిళ్లను గుజరాత్‌లోని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్‌డీడీబీ) ల్యాబ్‌కు పరీక్షల నిమిత్తం పంపారని వివరించారు. ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదికలో అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయని పయ్యావుల తెలిపారు. ఆ నెయ్యిలో సోయాబీన్, సన్‌ఫ్లవర్, చేపల నూనె, కొబ్బరి నూనె, పామాయిల్, వెజిటెబుల్ ఆయిల్ వంటివి కలిపినట్లు నివేదిక స్పష్టం చేసిందని అన్నారు. అంతటితో ఆగకుండా అందులో జంతు కొవ్వు కూడా కలిసినట్లు తేలిందని, ఇది అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. "భోలేబాబా డెయిరీలో తయారైన ఈ పదార్థానికి నెయ్యి అని పేరుపెట్టారు. దానికి నెయ్యి వాసన, రూపం వచ్చేందుకు రకరకాల రసాయనాలు కలిపారు. 2022లో మొదలైన ఈ నేరం 2024 వరకు నిరాటంకంగా కొనసాగింది. ఇదంతా తెలిసినా గత ప్రభుత్వం ఈ నివేదికను తొక్కిపెట్టింది" అని పయ్యావుల ఆరోపించారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన హెచ్చరించారు.

## కాంగ్రెస్ కోఆర్డినేటర్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు!

హైదరాబాద్: తెలంగాణలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ఎన్నికల ప్రచార హడావిడితో రాజకీయం హీటెక్కింది. ఈ క్రమంలో గురువారం ఓ అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. మున్సిపల్ ఎన్నికల కోసం కోఆర్డినేటర్ల జాబితాను టీపీసీసీ విడుదల చేసింది. అయితే అనూహ్యంగా ఈ జాబితాలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పేర్లు కనిపించడం చర్చనీయాంశమైంది. నిజామాబాద్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ గా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, ఇల్లందు మున్సిపాలిటీకి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, షాద్ నగర్ మున్సిపాలిటీకి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్లు టీపీసీసీ లిస్టులో దర్శనమిచ్చాయి. పైన చెప్పుకున్న ముగ్గురికి అనర్హత వివాదంలో స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం తెలిసిందే. కారు గుర్తు మీద పార్టీ ఫిరాయించారని 10 మందిపై బీఆర్ఎస్ తెలంగాణ స్పీకర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. వీళ్లలో ఇప్పటిదాకా కడియం శ్రీహరి, దానం నాగేందర్ తప్ప మిగతా 8 మందికి స్పీకర్ గడ్డం ప్రసాద్ క్లీన్ చిట్ ఇచ్చారు. వాళ్లు పార్టీ మారారు అనడానికి ఎలాంటి ఆధారాల్లేవని.. ఇంకా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే ఉన్నారంటూ తీర్పు ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికలు సాధారణంగా పార్టీ గుర్తు మీద జరిగే ఎన్నికలు. ఈ తరుణంలో.. నెక్స్ట్ ఏం జరగనుందో చూడాలి.

## మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు... అప్పుడు మిగిలిన పనులు చేసుకుందాం: హరీశ్ రావు



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ, మనల్ని బాగా చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు కానీ బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందని అన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప రేవంత్ రెడ్డికి తెలిసిందేమీ లేదని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలని సవాల్ చేశారు.

సీమకిరణం నంద్యాల కర్నూలు తెలుగు దినపత్రిక
www.seemakiranam.com, www.seemakiranamnews.com



# 8న ట్రాఫిక్ ప్రమాదాలపై అవగాహన

కర్నూలు ప్రగతి సమితి అధినేత ఎం.శ్రీహర్ష



**కర్నూలు ప్రతినిధి, ఫిబ్రవరి 06, (సీమకిరణం న్యూస్) :** ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇటీవల పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను తగ్గించాలనే లక్ష్యంతో ఈ నెల 8న డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఎం.శ్రీహర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాఫిక్ పోలీసులతో సంయుక్తంగా గుత్తి పెట్రోల్ బంక్ కూడలిలో అవగాహన కార్యక్రమం, సర్వమత ప్రార్థనలు, పోస్టర్ల ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి డ్రైవర్లు తప్పనిసరిగా హాజరై రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీహర్ష కోరారు.

# వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం వేడుకలు



**వెల్దుర్తి, ఫిబ్రవరి 06, (సీమకిరణం న్యూస్):** వెల్దుర్తి పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థినీల తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రావతి ఆధ్వర్యంలో, పాఠశాల చైర్మన్ రాజేష్ అధ్యక్షతన ఈ వార్షికోత్సవం నిర్వహించబడింది. పాఠశాలను రంగురంగుల అలంకరణలతో సుందరంగా ముస్తాబు చేశారు.



విద్యార్థినీలు వివిధ వేషధారణలతో వేదికపై కనువిందు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక, విద్యా పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధికారులు విద్యార్థినీలు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో కూడా ముందుండాలని సూచించారు. నేటి విద్యార్థినీలే రేపటి దేశ భవిష్యత్తుకు పునాది అని వారు పేర్కొన్నారు. విద్యార్థినీలు ప్రదర్శించిన దేశభక్తి గీతాలు, నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వివిధ ఆకృతులు, వేషధారణలకు అనుగుణంగా చేసిన నృత్య ప్రదర్శనలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. చిన్నారుల ప్రతిభకు తల్లిదండ్రులు, అతిథులు గ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తాం

ప్రజల సమస్యల అర్జీలు స్వయంగా స్వీకరించిన ఎమ్మెల్యే కొండయ్య

ప్రజా సమస్యలు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి



**చీరాల, ఫిబ్రవరి:06,(సీమకిరణం న్యూస్) :** ప్రజల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని చీరాల స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యారు. స్వయంగా ఎమ్మెల్యే కొండయ్య ప్రజల వద్ద నుండి సమస్యల వినతుల అర్జీలను స్వీకరించారు. ఈ ప్రజా దర్బార్ కార్యక్రమం కు వివిధ సమస్యలకు సంబందించిన మొత్తం 45 అర్జీలు రాగా వాటిలో ఇంటి నిర్మాణం నివాస స్థలాలు కోసం 27 అర్జీలు, పింఛన్లు కొరకు 15 అర్జీలు, , పలు సమస్యలపై 3 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, డిఎల్డిఓ, మున్సిపల్ వైస్ చైర్మన్ పొత్తూరి సుబ్బయ్య, కౌన్సిలర్ జగదీష్, కూటమి నాయకులు తేలప్రోలు నాగేశ్వరరావు, గుమ్మ వెంకటేష్, పట్టణ అధ్యక్షులు దోగుపర్తి వెంకట సురేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు,ప్రజలు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి వేడుకలకు ఎమ్మెల్యే ఏలూరి ని ఆహ్వానించిన కమిటీ సభ్యులు



**పర్చూరు, ఫిబ్రవరి:06,(సీమకిరణం న్యూస్) :** మహా శివరాత్రి పర్వదిన వేడుకలకు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి ని కలిసి ప్రత్యేకంగా ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు, బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల శివాలయం వద్ద ఈ నెల 15న జరిగే మహాశివరాత్రి తిరునాళ్ళ ను పురస్కరించుకొని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు ని కలిసి ఆహ్వానించిన ఆలయ అభివృద్ధి కమిటీ టీఎస్ఆర్ ఆంజనేయులు,మరియు గ్రామ పెద్దలు, తప్పనిసరిగా వేడుకలకు హాజరవుతానని కమిటీ సభ్యులకు ఏలూరి భరోసా నిచ్చి వేడుకలు అంగరంగ వైభవం నిర్వహించాలని కమిటీ సభ్యులకు సూచనలు చేశారు.

# చీరాల సబ్ డివిజన్ శక్తి టీం అవగాహన కార్యక్రమం

ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్న శక్తి టీమ్



**చీరాల, ఫిబ్రవరి :6, (సీమకిరణం న్యూస్) :** బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డిఎస్పి ఎండి మోయిన్ సూచనలతో చీరాల సబ్ డివిజన్ శక్తి టీం ఆధ్వర్యంలో రామ్ నగర్ ఎస్సీ కాలనీ మొదటి వార్డు మరియు 300 కాలనీలలో ప్రజలకు శక్తి టీం కానిస్టేబుల్ సుబ్బారావు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ వినియోగం, బాల్య వివాహాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నియమాలు, చిన్నపిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ప్రత్యేకంగా తల్లిదండ్రులు తమ పిల్లలు ఏమి చేస్తున్నారు, ఎవరితో తిరుగుతున్నారు, చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారా అనే విషయాలను నిరంతరం గమనించాలని సూచించారు. ప్రేమ పేరుతో పాఠశాల స్థాయిలోనే పిల్లలు తప్పుదారిలోకి వెళ్లే ప్రమాదం ఉందని, అందుకే వారి సెల్‌ఫోన్లు, పుస్తకాల సంచులు అప్పుడప్పుడు పరిశీలించాలని తల్లిదండ్రులకు శక్తి టీం సభ్యులు కానిస్టేబుల్ సుబ్బారావు సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని, ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుమతి లేకుండా ఇచ్చిన డిప్యూటేషన్లు చెల్లవు

జిల్లా కలెక్టర్ డా "వి వినోద్ కుమార్




**బాపట్ల,ఫిబ్రవరి:06,(సీమకిరణం న్యూస్ ) :** జిల్లాలో అనుమతి లేకుండా జారీ చేసిన డిప్యూటేషన్ ఆదేశాలు చెల్లుబాటు కావని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ న్యూ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్వర్ణ అవార్డు, స్వర్ణ గ్రామ ఉద్యోగుల డిప్యూటేషన్లపై సమగ్రంగా ఆరా తీశారు. వివిధ శాఖల్లో అనుమతితో లేదా అనుమతి లేకుండా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలు, ఆర్డర్ కాపీలు సేకరించాలని ఆదేశించారు. ఈ సమీక్షలో డిఆర్ఓ గంగాధర్ గౌడ్ ఉన్నారు.

# భూ వివాదాలు లేని రాష్ట్రంగా ఏపీ : సీఎం చంద్రబాబు




















2027 డిసెంబరు నాటికి అందరికీ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకం

14 విశిష్ట భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకం...రికార్డుల ట్యాంపరింగ్ కు ప్రయత్నిస్తే జైలుకే

తాడేపల్లి వద్ద హెలిపాడ్ కోసం ప్రైవేటు భూమిని 22ఏలో పెట్టారు

కర్నూలు జిల్లా కలుగట్లలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో సీఎం చంద్రబాబు

**అమరావతి/ కర్నూలు బ్యూరో, ఫిబ్రవరి 06, (సీమకిరణం న్యూస్) :** ఆంధ్రప్రదేశ్ ను భూవివాదాలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. 2027 డిసెంబరు నాటికి సర్వే పూర్తి చేసి రాష్ట్రంలో రైతులు, భూ యజమానులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని కలుగొట్ల గ్రామంలో మీ భూమి- మీహక్కు కింద పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. భవిష్యత్ లో ఎవరూ ట్యాంపరింగ్ చేయకుండా, ఒక్క పైసా అవినీతికి తావు లేకుండా రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్ తో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎవరైనా ట్యాంపరింగ్ కు ప్రయత్నిస్తే నేరుగా జైలుకే వెళతారని, అవసరమైతే పీడీ యాక్టు కింద కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ...మీ భూమికి భద్రత కల్పించడం నాకు ఆనందాన్నిస్తోంది. భూమి ఆస్తి ఒక్కటే కాదు..అది మన జీవనాధారం. కుటుంబానికి భద్రత. భవిష్యత్‌కు నమ్మకం. కూటమి ప్రభుత్వం భూమి- నీరు-సాగుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. వివాదాలు లేని భూములు, పుష్కలంగా ప్రతి ఎకరాకు నీరు, లాభాలు తెచ్చిపెట్టేలా సాగును ప్రోత్సహించటమే లక్ష్యాలుగా పెట్టుకుని పనిచేస్తున్నాం. రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వడమే నా జీవితాశయం. కర్నూలు జిల్లాలో పశ్చిమ తాలూకాకు నీరు అందిస్తే రాష్ట్ర మంతటా నీరు ఇచ్చినట్టే. వారసత్వంగా వచ్చిన ఆస్తిపై వేరే వారి ఫొటోలు వేయడమేంటని గత ఎన్నికల్లో నేను ప్రశ్నించాను. గత పాలకులు తప్పుడు విధానాలతో ప్రజలను బానిసలు చేయాలని కుట్ర చేశారు. లోపభూయిష్టమైన ల్యాండ్ టైట్లింగ్ చట్టాన్ని తెచ్చారు. ప్రజల జుట్టు వాళ్ల చేతుల్లో పెట్టుకుని ఆడించాలని చూశారు. పట్టాదారు పాసు పుస్తకాలపై, పొలం సరిహద్దు రాళ్లపై వారి ఫొటోలు, పేర్లు ముద్రించుకున్నారు. వాళ్లు అడిగిన భూములు ఇవ్వకపోతే 22 ఏలో పెట్టారు. కక్ష తీర్చుకోవడానికి అన్ని ఆయుధాలు ఉపయోగించారు. ప్రజలను భయభ్రాంతులను చేసేందుకు పులివెందుల నుంచి మనుషులను తెచ్చుకున్నారు. రీ సర్వే పేరుతో రూ.700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. పట్టాదారు పాసు పుస్తకాలపై ఫొటోలు వేసుకోవడం శాడిజం కాదా? లక్షల ఎకరాల ప్రైవేటు భూములను ప్రభుత్వ భూములుగా మార్చేశారు. రికార్డులు తారుమారు చేశారు. తాడేపల్లి ప్యాలెస్ పక్కన హెలీప్యాడ్ కోసం..70 ఏళ్లుగా పక్కా డాక్యుమెంట్లు ఉన్న భూమిని ఒక వ్యక్తి దగ్గర బలవంతంగా తీసుకుని ప్రభుత్వ భూమిగా మార్చేశారు. ఇదేమని అడిగితే 22 ఏలో పెట్టి వివాదం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల వద్ద నుంచి వస్తున్న ఫిర్యాదుల్లో 80 శాతం పైగా అర్జీలు రెవెన్యూ పరమైనవే వస్తున్నాయి. రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించి ఏమీ తెలీనట్టు గత ఐదేళ్లు బ్రహ్మాండంగా పాలన చేసినట్టు మాట్లాడుతున్నారు. మీరు సమర్థవంతంగా పని చేస్తే ఇన్ని సమస్యలు ఎలా వచ్చాయి? నేను నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యాను. నా జీవితంలో ఇలాంటి భూ సమస్యలు ఎప్పుడూ చూడలేదని" సీఎం చంద్రబాబు అన్నారు.

**పైసా అవినీతి లేకుండా పాస్ పుస్తకాల పంపిణీ**

"అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. భవిష్యత్ లో ఎవరూ ప్రజల భూమిపై కన్ను వేయకుండా భద్రత కల్పిస్తున్నాం. ప్రతీ పాస్ పుస్తకానికి ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్, యూనిక్ నెంబర్ ఉంటుంది. ఎవరైనా సరే ఈ క్యూఆర్ కోడ్ ద్వారా భూమి వివరాలను వెంటనే తెలుసుకోవచ్చు. మీ పాసు పుస్తకంలో ఉన్న క్యూఆర్ కోడ్ ను మీ ఫోన్ ద్వారా స్కాన్ చేస్తే అందులో వచ్చే మ్యాప్ మిమ్మల్ని నేరుగా మీ పొలం వద్దకు తీసుకు వెళుతుంది. డాక్యుమెంట్ల వివరాలను ట్యాంపర్ చేయకుండా బ్లాక్ చైన్ లాంటి పటిష్ట వ్యవస్థను తెస్తున్నాం. ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత. మీ రికార్డులన్నీ మీ అనుమతితోనే చేస్తున్నాం. ముందుగా డ్రాఫ్ట్ పట్టా దార్ పాస్‌బుక్ జారీ చేసి అందులో వ్యక్తిగత వివరాలు, భూమి వివరాలు సరిగ్గా ఉన్నాయో, లేవో భూ యజమానులు నిర్ధారించుకునే అవకాశం ఇచ్చాం. వఖ్జ ధృవీకరణ తప్పనిసరిగా తీసుకుంటున్నాం. దీంతో తప్పులు దొర్లేందుకు వీలుపడదు. పైసా అవినీతి లేకుండా పట్టాదారు పుస్తకాలు ఇస్తున్నాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు గ్రామాల చొప్పున రాష్ట్రంలో మొత్తం 279 గ్రామాల్లో ముందుగా పంపిణీ చేపట్టాం. ప్రస్తుతం 1,16,870 డ్రాఫ్ట్ పాస్ బుక్స్ సిద్ధంగా ఉన్నాయి. వీటిలో 91,038 డ్రాఫ్ట్ పాస్ బుక్స్ వఖ్జ కూడా పూర్తయ్యింది. కర్నూలు జిల్లాలోని 13 గ్రామాల్లో 8,347 మందికి కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నాం. కలుగట్ల గ్రామంలో 1,178 కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేసుకుంటున్నాం. ఇప్పటివరకూ 37 లక్షల 40 వేల పట్టా దారు పాస్ పుస్తకాలు సిద్ధమయ్యాయి. ఇందులో 19 లక్షలు లక్షలు ఇప్పటికే పంపిణీ చేయగా..18 లక్షల 40 వేలు ఏప్రిల్ లోగా పంపిణీ చేస్తాం. ఇది కాకుండా 9,500 గ్రామాల్లో సర్వే చేయాలి. అవి చేస్తే 60 లక్షల మందికి కొత్తగా పాస్ పుస్తకాలు ఇచ్చే అవకాశం వస్తుంది. 2027 డిసెంబర్ నాటికి ప్రతి ఒక్కరికీ పట్టాదారు పుస్తకాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. జాయింట్ ఎల్పీఎంల విషయంలో వివాదాలు పరిష్కరించుకోవాలని" ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

**సీమలో ప్రాజెక్టులు టీడీపీ ఘనతే**

"రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టుల ఘనత టీడీపీదే. హంద్రినీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులు రావడానికి నాడు తెలుగుదేశం పార్టీ చూపిన చొరవే కారణం. తెలుగుగంగ సీమను సస్యశ్యామలం చేయడంతో పాటు చెన్నై దాహార్తి తీరుస్తోంది. నదుల అనుసంధానం చేసి సీమను సస్యశ్యామలం చేస్తాము. అనంతపురం జిల్లాలో నీటి సంరక్షణకు మేము తీసుకున్న చర్యలతో ప్రధాని మోదీ మన్ కీ బాత్ లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. సీమను హార్టికల్చర్ హబ్ గా తయారుచేస్తున్నాం. దేశంలో ఎక్కువ పండ్లు పండేది రాయలసీమలోనే. రాష్ట్రంలో 400 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు ఉత్పత్తి అయితే అందులో 220 లక్షల మెట్రిక్ టన్నులు సీమ నుంచే వస్తున్నాయి. రాబోయే రోజుల్లో 500 లక్షల మెట్రిక్ టన్నుల పండ్లు ఉత్పత్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. గత ప్రభుత్వంలో 8 సార్లు చార్జీలు పెంచారు. రూ. 32 వేల కోట్ల మేర విద్యుత్ భారాన్ని మోపారు. రూ.1.20 లక్షల కోట్ల అప్పు చేశారు. కూటమి ప్రభుత్వం భవిష్యత్ లో కరెంటు చార్జీలు పెంచబోదని హామీ ఇస్తున్నాను. నేనూ రాయలసీమలోనే పుట్టాను. ఎన్టీఆర్ కూడా సీమ ముద్దు బిడ్డే. మూడేళ్లలో కడప స్టీల్ ప్లాంట్ పనులు పూర్తి చేసే బాధ్యత నాది. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులు పెడుతున్నాం. సీమలో స్పేస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్, ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు వస్తున్నాయని" ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**సాగునీటి రంగానికి మా మొదటి ప్రాధాన్యత**

"2014 -19 మధ్య సాగునీటి రంగానికి రూ. 68 వేల కోట్లు ఖర్చు చేశాం. గత పాలకులు పోలవరం ప్రాజెక్టు పాలిట శనిలా దాపురించారు. అసమర్థత, నిర్లక్ష్యంతో రూ. 440 కోట్ల విలువైన డయాఫ్రాం వాల్ దెబ్బతింది. దీని కోసం అదనంగా రూ. 1000 కోట్లు ఖర్చయింది. సమయం కూడా వృథా అయ్యింది. 2027లో పుష్కరాల కంటే ముందే పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం ఇస్తాం. పట్టి సీమ ద్వారా కృష్ణాడెల్టాకు గోదావరి నీరిచ్చి, శ్రీశైలం నీటిని సీమకు మళ్లించాం. పదేళ్లుగా సీమలో కరువు లేకపోవటానికి మా దూరదృష్టే కారణం. నీరుంది కాబట్టే కియాలాంటి పరిశ్రమలు వచ్చాయి. మచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ప్రాజెక్టులు ఉంచుకుని రాయలసీమ లిఫ్ట్ పేరుతో నాటకాలు ఆడారు. కర్నూలు జిల్లాకు నీరిచ్చే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుంటుంది. రాజోలి బండ, గురు రాఘవేంద్ర, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేస్తాం. తుంగభద్ర డ్యామ్ నుంచి వచ్చే నీరు కర్నూలు జిల్లా ఉపయోగించుకుంటే నీటి సమస్య చాలా వరకూ తీరుతుంది. ఎమ్మిగనూరులో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది వస్తే 2 వేల మంది చేనేతలకు ఉపాధి లభిస్తుంది. గాజుల దిన్నె పూర్తి చేస్తాం. రూ.138 కోట్లతో ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం అంగీకరించింది. ఎమ్మిగనూరు, ఆదోని మీదుగా రైల్వే లైన్లపై దృష్టి పెడతాం. సీమలో 120 ప్రాజెక్టులకు అనుమతి ఇస్తే గత పాలకులు అన్నిటినీ రద్దు చేశారని" ముఖ్యమంత్రి తెలిపారు.

**శ్రీవారి లడ్డూ తయారీలో రసాయనాలు**

"అత్యంత పవిత్రమైన శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని వాడారు. నేషనల్ డైరీ డెవలప్మెంట్ బోర్డు ఇచ్చిన నివేదికతో మేం మాట్లాడుతుంటే.. సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని చెప్పుకుంటున్నారు. రసాయనాలు కలిసినట్టు నివేదికలో ఉందని వాళ్ల బాబాయ్ కూడా మాట్లాడుతున్నారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీటీడీ నుంచే ప్రక్షాళన మొదలుపెట్టాం. గత పాలకుల హయాంలో తయారు చేసిన లడ్డూకి ఇప్పటి లడ్డూ ప్రసాదానికి నాణ్యతలో ఎంతో వ్యత్యాసం ఉంది. శ్రీశైలంలోనూ రసాయనాలు వాడి ప్రసాదం కల్తీ చేశారు. తప్పు చేసి నన్ను క్షమాపణ చెప్పమంటున్నారు. పరామర్శల పేరుతో గుంటూరు వెళ్లేందుకు 6 గంటలు రోడ్డు బ్లాక్ చేసి మరే వాహనాలు వెళ్లకుండా ఇబ్బందులు పెట్టారు. గతంలో కాన్వాయ్ కింద సింగయ్య అనే వ్యక్తిని తొక్కించి చంపారు. బంగారుపాళ్యంలో మామిడి కాయలను కింద పడేసి బల ప్రదర్శనకు దిగారు. బలప్రదర్శన ఎన్నికల సమయంలో చేయాలి. ఇలాంటి వారిని ఎలా ఎదుర్కోవాలో నాకు తెలుసు. ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోను. శాంతిభద్రతల నిర్వహణలో కఠినంగా ఉంటాను. ప్రజాసంక్షేమానికి పెద్దపీట వేయటంతో పాటు ప్రతీ రైతునూ ఆదుకుంటాం. ఉల్లికి రేటు లేకపోతే హెక్టారుకు రూ.50 వేల చొప్పున చెల్లించాం. మామిడి, కోకో పోగాకు లాంటి పంటలకూ సబ్సీడీ ఇచ్చి ఆదుకున్నాం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ కార్యక్రమానికి మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నాబార్డు సహకారంతో వాటర్‌షెడ్ పనులకు శ్రీకారం



**ప్యాపిలి, ఫిబ్రవరి 06 (సీమ కిరణం న్యూస్ ) :** సుస్థిర సహజ వనరుల నిర్వహణ, గ్రామీణ జీవనోపాధి అభివృద్ధే లక్ష్యంగా నాబార్డు ఆర్థిక సహకారంతో, క్రెడ్ (ఎస్ఆర్ఈడి) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎస్. రంగాపురం వాటర్‌షెడ్ ప్రాజెక్టు పనులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా ముఖ్య అతిథులుగా హాజరై శుక్రవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. అనంతరం ప్రాజెక్టు పరిధిలోని సీబీపీ రిడ్జ్ ప్రాంతంలో మట్టి, నీటి సంరక్షణ పనులను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు.



కార్యక్రమంలో భాగంగా కలాచట్ల వాటర్‌షెడ్ పరిధిలో విద్యార్థులకు పుస్తకాలు, స్వయం సహాయక సంఘాల మహిళలకు జీవనోపాధి చెక్కులను అందజేశారు. అలాగే హార్టికల్చర్ శాఖ సహకారంతో లబ్ధిదారులకు ఎలక్ట్రిక్ కూరగాయల విక్రయ యంత్రాలను (ఈ-కార్ట్స్), రైతులకు డ్రిప్ ఇరిగేషన్ కిట్లను పంపిణీ చేశారు. సహజ సాగును ప్రోత్సహించేందుకు సౌరశక్తితో పనిచేసే 'ఆటోమేటిక్ బయో-రిసోర్స్ సెంటర్'ను ప్రారంభించి, డ్రోన్ స్ప్రేయింగ్, మొబైల్ డ్రిప్ పనితీరును ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నాబార్డు డీడీఎం కే.ఆర్.డి. కార్తీక్, క్రెడ్ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, డ్వామా, డీఆర్డీఏ పీడీలు, ఎల్డీఎం, ఎంపీడీవో, తహసిల్దార్ ,ఉద్యానవన శాఖ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై యంత్రాల పంపిణీ




**ప్యాపిలి, ఫిబ్రవరి 06 (సీమ కిరణం న్యూస్ ) :** మండల పరిదిలోని కలచట్ల గ్రామంలో రైతు సేవ కేంద్రం నందు ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో పలు రైతు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యాన యాంత్రీకరణ పథకం కింద పండ్ల తోటల రైతులకు చిన్న ట్రాక్టర్లను 50 శాతం రాయితీతో అందజేశారు.



మండలంలోని రవికుమార్, రామాంజనేయులు అనే రైతులకు ఆర్‌కేవీవై (ఆర్ కెవి వి) పథకం కింద ఒక్కో చిన్న ట్రాక్టర్‌కు రూ.1,96,000 సబ్సిడీతో మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో చిన్న, సన్నకారు రైతులు పండించిన పంటలను విక్రయించేందుకు అనువుగా ఉండే వెండింగ్ కార్టులను నాబార్డ్--ఉద్యాన శాఖ కన్వర్జెన్సీ ద్వారా కలచట్ల గ్రామానికి చెందిన ముగ్గురు రైతులకు అందజేశారు. ఒక్కో వెండింగ్ కార్ట్ మొత్తం ఖరీదు రూ.36,000 కాగా, రూ.15,000 సబ్సిడీతో పంపిణీ చేశారు. వీటిలో 18--25 డిగ్రీల శీతలీకరణ సదుపాయం ఉండడం వల్ల నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అధికారులు తెలిపారు. అలాగే ఆర్‌కేవీవై పథకం కింద మొత్తం ఖరీదు రూ.23,000 గల స్ప్రేయర్‌ను రూ.10,000 సబ్సిడీతో అంజి అనే రైతుకు అందజేశారు. కలచట్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు అనే రైతుకు టమాటో బాక్సులను ఒక్కోటి రూ.245 మొత్తం ఖరీదుతో, రూ.120 సబ్సిడీతో 40 బాక్సులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి యు. నాగరాజు, ఉద్యాన అధికారిని జి. కళ్యాణి రైతు సేవ కేంద్ర సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికిన మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు











**కర్నూలు ప్రతినిధి/ఎమ్మిగనూరు ఫిబ్రవరి 06, (సీమకిరణం న్యూస్) :** మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీలో భాగంగా ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు ఘన స్వాగతం లభించింది. మధ్యాహ్నం 12:20 గం.లకు కలుగొట్ల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో హెలిప్యాడ్ వద్ద జిల్లా ఇన్చార్జ్ మంత్రి మరియు జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, రాష్ట్ర రెవెన్యూ మరియు రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టి.జి.భరత్, , కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, డిఐజి కోయ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బి. వి. జయ నాగేశ్వర రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కెఈ.శ్యామ్ బాబు, ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి వాల్మీకి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, టిడిపి జిల్లా అధ్యక్షులు గుడిసె కృష్ణమ్మ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, మాజీ ఎంపీ డాక్టర్ సంజీవ్ కుమార్, మంత్రాలయం ఇంఛార్జి రాఘవేంద్ర రెడ్డి, ఆలూరు ఇంఛార్జి వైకుంఠం జ్యోతి, కురవ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, బోయ కార్పొరేషన్ చైర్మన్ బొజ్జమ్మ, శ్రీశైలం బోర్డు డైరెక్టర్ రేఖ గౌడ్, డి.సి.ఎంఎస్ నాగేశ్వర రావు, కుడా చైర్మన్ సోమశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, వివిధ పార్టీ నాయకులు తదితరులు ముఖ్యమంత్రి కి ఘన స్వాగతం పలికారు.

**ముఖ్యమంత్రికి ఆత్మీయ వీడ్కోలు**

ఎమ్మిగనూరు మండలం కలుగొట్ల గ్రామంలో మీ భూమి-మీ హక్కు కార్యక్రమంలో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమం అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. తదుపరి మ.4:50 గం.లకు బయలుదేరి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి మరియు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి . వెంకటేష్, డిఐజి కోయ ప్రవీణ్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ జయ నాగేశ్వర రెడ్డి, అధికారులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.

# శ్రీశ్రీశ్రీ రామానందట్రస్ట్ భూరీ విరాళం



ట్రస్టు సేవలను ప్రశంసించిన ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

పేదల వైద్య ఖర్చల నిమిత్తం ట్రస్టు ఆర్థిక సహాయ

పేద విద్యార్థులకు ఫీజుల చెల్లింపుకు సహాయం

టీబి రోగులకు 6 నెలలకు సరిపడే పౌష్టికాహార కిట్లు పంపిణీ

క్రిటికల్ కేర్ యూనిట్ పనులను ఎమ్మెల్యే కొండయ్య తో

పరిశీలించిన స్వామిజీ



**చీరాల :, ఫిబ్రవరి:06,(సీమకిరణం న్యూస్ ) :** చీరాల నియోజకవర్గ పరిధిలో ని వాడరేవు శ్రీశ్రీశ్రీ రామానంద సరస్వతి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామి రామానంద సరస్వతి స్వామి భూరీ విరాళం ప్రకటించారు. చీరాల ప్రభుత్వ ఏరియా వైద్యశాల ఆవరణలో స్వామి రామానంద సరస్వతి స్వామి వారి ఆశీస్సులతో సామాజిక సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. స్థానిక ఎమ్మె ల్యే కొండయ్యతో కలిసి పేదలకు వైద్య సహాయం, పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం, టీబి రోగులు సుమారు 200 మందికి ఆరు నెలలపాటు సరిపడే పౌష్టికాహార కిట్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభయాన్ పౌష్టిక పోషకాహార కిట్లు పంపిణీ చేసి వారి సేవా నిరతిని దత్రుత్వాన్ని చాటుకున్నారు. పేరాల ఓంకార క్షేత్రం నిర్మాణానికి రూ.2లక్షలు, లింగాపురం శివాలయంలో విగ్రప్రతిష్టకు రూ.ఒక లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడాతూ స్వామి రామానంద సరస్వతి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. విద్య, ఆరోగ్యం, ఆధ్యాత్మిక రంగాల్లో స్వామివారు చేస్తున్న కృషి పేదలకు ఎంతో బరోసా ఇస్తుందని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రస్టు ద్వారా అందజేస్తున్న ఆర్థిక సహాయం వివరాలను ట్రస్టు మేనేజర్ నారాయణం సురేష్ వివరాలు తెలిపారు. వారిలో ఎన్ పార్వతికి రూ.2వేలు, కె లతకు రూ.2500, ఎం శ్రీలక్ష్మికి రూ.3వేలు, ఎం పార్వతికి రూ.2500 వైద్య ఖర్చులనిమిత్తం, పరిమి శివయ్యకు రూ.5వేలు, కె శశికుమార్‌కు రూ.10వేలు సహాయం చేసినట్లు తెలిపారు. ఆరు నెలల పాటు వీరందరికీ వైద్య ఖర్చుల నిమిత్తం పూర్తి భరోసాగా ఆర్థిక సహాయం చేయ్య నున్నట్లు తెలిపారు. కోట వెంకటరమణకు రూ.30వేలు, పఠాన్ ఫర్జాన్‌కు రూ.30వేలు కళాశాల ఫీజుల నిమిత్తం చెక్కులు అందజేశారు. నాగవరపు పార్వతి ఇంటి నిర్మాణానికి రూ.25వేలు చెక్కు, పోస్టు మాన్‌కు రూ.7500 విలువైన సైకిల్, మహాశివరాత్రి పండుగ సందర్భంగా చీరాల శివాలయం వద్ద అన్నదానం కు కే శ్రీనివాసరావు కు రూ.20వేలు అందజేశారు. కీర్తివారిపాలెం గ్రామంలో సిమెంటు బల్లల ఏర్పాటుకు రూ.15వేలు అందజేశారు. అనంతరం చీరాల ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో నూతనంగా నిర్మించనున్న 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ పనులను శాసన సభ్యులు ఎంఎం కొండయ్యతో కలిసి రామానంద సరస్వతి స్వామి వారు పరిశీలించారు. వీరి వెంట హాస్పిటల్స్ సిబ్బంది, కూటమి నాయకులు, రామానంద ట్రస్ట్ ప్రతినిధులు కుమార్, వైద్యశాల సూపర్డెంట్ శ్రీకాంత్, పూర్వి స్కాన్ ఎండి డాక్టర్ పేట శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ తోనే రాష్ట్ర ప్రగతి సమగ్రాభివృద్ధి పునర్నిర్మాణం

బూత్ స్థాయి వ్యవస్థ పటిష్టంగా ఉంటే శాశ్వత విజయం

ఎన్నికల యుద్ధంలో పోలింగ్ బూత్‌లే కీలకం

నంద్యాల పార్లమెంట్ శ్రేణులకు

ఎమ్మెల్యే ఏలూరి దిశానిర్దేశం



**పర్చూరు, ఫిబ్రవరి:06,(సీమకిరణం న్యూస్) :** తెలుగుదేశం పార్టీ ఎన్నికల విజయానికి బూత్ స్థాయి వ్యవస్థే కీలకమని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పష్టం చేశారు. ప్రతి కార్యకర్త బూత్ స్థాయిలో చురుకుగా, నిబద్ధతతో పనిచేస్తే విజయం తథ్యమని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన ఫోకస్ బూత్‌ల వర్క్‌షాప్ లో నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, పునర్నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో వేగంగా అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. అపార అనుభవం, మేధస్సు, అంకితభావం కలిగిన నేతగా చంద్రబాబు రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారని కొనియాడారు.రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, రానున్న ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ఒక యజ్ఞంలా పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన వయస్సు, మేధస్సును దృష్టిలో ఉంచుకొని తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులుగా ప్రతి కార్యకర్త రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.బూత్ మేనేజ్మెంటే పార్టీకి అసలైన బలం ప్రతి బూత్‌లో ఓటర్ల పూర్తి వివరాలు, స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల సమాచారం స్పష్టంగా ఉండాలని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. ఎన్నికల రోజే కాదు ఎన్నికల ముందు రోజు, ఎన్నికల తరువాత కూడా బూత్ స్థాయి వ్యవస్థ బలంగా ఉండాలని అదే పార్టీకి శాశ్వత బలం అని ఆయన స్పష్టం చేశారు.ఎన్నికల వ్యూహాలపై స్పష్టత... ఈ వర్క్‌షాప్‌లో బూత్ కమిటీ నిర్మాణం, బూత్ ఇన్‌చార్జ్‌ల బాధ్యతలు, ఓటర్లతో నిరంతర సంప్రదింపులు, సోషల్ మీడియా సమర్థ వినియోగం, ప్రతిపక్ష ప్రచారాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై ఎమ్మెల్యే ఏలూరి విపులంగా వివరించారు. ప్రజల నమ్మకం గెలవడమే అసలైన ఎన్నికల వ్యూహమని ఆయన పేర్కొన్నారు.సంస్థాగత బలోపేతమే లక్ష్యం... గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు తెలుగుదేశం పార్టీని పటిష్టంగా నిలబెట్టాలంటే క్రమశిక్షణ, సమన్వయం తప్పనిసరిగా అవసరమని ఏలూరి తెలిపారు.పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు గౌరవం లభించేలా వ్యవస్థ ఉండాలి. కార్యకర్తే పార్టీకి ప్రాణం"అని అన్నారు.విజయానికి మార్గదర్శకంగా వర్క్‌షాప్...ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఏలూరి సూచనలను ఆసక్తిగా విన్నారు. ఈ సమావేశం తమకు స్పష్టమైన దిశానిర్దేశం చేసిందని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమం ద్వారా రాబోయే ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ బూత్ స్థాయి నుంచే సమగ్రంగా సిద్ధమవుతోందని, సంస్థాగతంగా మరింత బలపడే దిశగా అడుగులు వేస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# జాప్యం లేకుండా అర్జీలను త్వరతగతిన పరిష్కారించాలి

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధమ కర్తవ్యం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు



**బాపట్ల, ఫిబ్రవరి:06,(సీమకిరణం న్యూస్) :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటిని సత్వరమే పరిష్కరించడమే లక్ష్యంగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శుక్రవారం బాపట్ల పట్టణ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ పి -4 కార్యాలయంలో 'ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ప్రజల వద్ద నుండి ఆయన స్వయంగా వినతులు,ఫిర్యాదులను స్వీకరించారు.ప్రధానంగా పెన్షన్లు, రేషన్ కార్డులు, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల మరమ్మతులు మరియు భూ సంబంధిత సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే కి విన్నవించుకున్నారు. అర్జీలు స్వీకరించిన వెంటనే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడారు, ప్రజలు సమర్పించిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, ప్రతి అర్జీదారునికి న్యాయం జరిగేలా చూడాలని ఆయన సూచించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ద్వారా సమస్యల పరిష్కారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదని, ఈ 'ప్రజా దర్బార్' ద్వారా నేరుగా ప్రజల వద్దకే పాలనను తీసుకువస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సేవలు అందే వరకు విశ్రమించమని, కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవా చేయటానికి నిరంతరం సిద్ధం గా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యే తో పాటు అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బాల సదనంను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు




**బాపట్ల,ఫిబ్రవరి:06,(సీమకిరణం న్యూస్) :** బాపట్ల పట్టణంలోని బాల సదనాన్ని స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సదనంలోని వసతులను, రికార్డులను స్వయంగా పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న భోజన సదుపాయాలు, తాగునీరు మరియు గదుల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు.బాల సదనంలోని పిల్లలతో ఆయన సరదాగా గడిపారు. వారికి అందుతున్న విద్యా బోధన, భోజనం నాణ్యత మరియు ఇతర సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని పిల్లలకు భరోసా ఇచ్చారు. సదనంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, పారిశుధ్యం విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని సంబంధిత అధికారులను ఆదేశించారు. పిల్లల భద్రత మరియు ఆరోగ్యం పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిరుపేద పిల్లలకు అండగా ఉండి, వారికి మెరుగైన భవిష్యత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, బాల సదనాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు స్థానిక నాయకులు, అధికారులు మరియు సదనపు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరంగనాయక స్వామిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ డా" వి వినోద్ కుమార్

స్వామి వారి ఆశీస్సులు జిల్లా ప్రజలందరికి ఉండాలి



**ఫిబ్రవరి 06, (సీమకిరణం న్యూస్) :** బాపట్ల జిల్లా నగరం మండలం పెద్దవరం గ్రామ లో వెలసి యున్న శ్రీరంగనాయక స్వామి వారిని శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ దర్శించుకున్నారు. రేపల్లె నియోజకవర్గం,నగరం మండలం, పెద్దవరం గ్రామం నందు భుహక్కు పత్రం, పట్టదారు పాస్ బుక్స్( మీ భూమి - మీ హక్కు) పాస్ బుక్స్ రైతులకు పంపిణీ చేసే కార్యక్రమంలో బాగంగా శుక్రవారం ఉదయం పెద్దవరం గ్రామం చేరుకున్న జిల్లా కలెక్టర్ కు ఆర్డీఓ, శ్రీరంగనాయక స్వామి వారి ఆలయ అధికారులు మరియు అర్చకులు జిల్లా కలెక్టర్ కు స్వాగతం పలికారు. శ్రీరంగనాయక స్వామి వారిని ప్రత్యేక దర్శనం చేయించి అనంతరం అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు కలెక్టర్ కు అందజేసి ఆశీర్వచనం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు శ్రీ రంగనాయక స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జిల్లా ప్రజలు సుబిక్షంగా. ,సంతోషంగా ఉండాలని మరియు జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హరే రామ్, రేపల్లె ఆర్డీఓ యన్ రామలక్ష్మి, తహాశీల్దార్ నాచారయ్య, అనగాని శివ ప్రసాద్, ఆలయ అధికారులు ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

# నగర సమగ్ర ప్రగతే లక్ష్యం : మంత్రి టీ.జీ.భరత్

జాప్యమైన పనులు త్వరితగతిన పూర్తి

ట్రేడ్ లైసెన్స్ రుసుములు యథాతథం

తాగునీరు, వీధి కుక్కలపై చర్యలు






**కర్నూలు ప్రతినిధి, ఫిబ్రవరి 06, (సీమకిరణం న్యూస్):** నగర సమగ్ర ప్రగతే లక్ష్యంగా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గుత్తేదారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీ.జీ.భరత్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో కమిషనర్ పి.విశ్వనాథ్, మున్సిపల్ అధికారులు, గుత్తేదారులతో వార్డుల వారీగా అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. గుత్తేదారుల వారీగా జాప్యమైన పనులను పరిశీలించిన మంత్రి నిర్దేశిత గడువులోపు పనులు పూర్తి చేయాలని, అవసరమైన చోట సమన్వయంతో సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో ఎలాంటి అలసత్వం సహించబోమని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులకు స్పష్టం చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెంచిన ట్రేడ్ లైసెన్స్ రుసుములను పాత రుసుముల మేరకే వసూలు చేయాలని ఆదేశించారు. మున్సిపల్ దుకాణాల అద్దె బకాయిలను రాబట్టాలని సూచించారు. వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు సంతాన నియంత్రణ కేంద్రంలో రోజువారీ చికిత్స సామర్థ్యాన్ని 100 శునకాలకు పెంచాలని తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎస్ఈ విష్ణుమూర్తి, డిసిపి వెంకటరమణ, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ ప్రసాద్ బాబు, కార్యదర్శి నాగరాజు, ఆర్వోలు జునైద్, వాజీద్, స్వర్ణలత, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, ఎంఈలు మనోహర్ రెడ్డి, గిరిరాజ్, డిఈఈలు, ఏఈలు, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO.27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830,8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com